# వయసు

**వారం రోజులుగా ఆమె కోసం ఎదురు చూస్తున్నాను. క్రమం తప్పకుండా ఇక్కడికి వచ్చే ఆమె ఈ వారం రోజులుగా ఎందుకు రావటం లేదో తెలియటం లేదు.**

నిజామాబాద్‌కి కొన్ని కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలీసాగర్ గార్డెన్ కి నేను రోజూ వస్తుంటాను. ఒక విధంగా నాకు వాకింగ్ అయినట్లుగా ఉంటుంది. ఆమెని చూసినట్లుగా ఉంటుంది.



నిజామాబాద్ రోడ్లు చూస్తుంటే కంపరం పుడుతుంది. అంత దరిద్రంగా ఉంటాయి. నిజామా బాద్‌లో అన్నిటికంటే అందమైనది మనసుకి ఆహ్లాదం కలిగించేది ఈ ఆలీ'సాగర్ గార్డెన్. మూడు వందల ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న ఆ స్థలంలో పెద్ద పెద్ద పేరుతెలియని ఎన్నో రకాల వృక్షాలు, పచ్చని గడ్డి, ఆ గడ్డిలో స్వేచ్ఛగా తిరుగుతున్న కుందేలుపిల్లలు. ఎన్నో రకాల అందమైన పక్షులు. అక్కడక్కడా చిన్న హట్స్. రెల్లుగడ్డితో కప్పి ఉన్న ఆ హట్స్ చూస్తుంటే నా మనసు ఎందుకో చలిస్తుంది. చాల వరకు ఆ హట్స్ పాడయి పోయాయి. ఒక్క హట్ మాత్రం నన్ను విపరీతంగా ఆకర్షిస్తూ ఉంటుంది.

హట్‌ని కప్పుతూ— హట్ పైకి పూర్తిగా పాకిన క్రీపర్స్— అక్కడ ఒక చిన్న పచ్చనికొండ ఉందా అని పిస్తుంది. హట్ లోపలి భాగమంతా క్రమ పద్ధతిలో కత్తిరించినట్లుగా పచ్చనిగడ్డి పరుచుకుని పచ్చని తివాచిలా ఉంటుంది. ఆ హట్‌ని రోజూ చూస్తూనే ఉన్నా దాని అందం రోజు రోజూ పెరుగుతున్నట్లుగానే ఉంది.

ఆలీ సాగర్‌కి సరి అయిన పోషణ లేదు. ఆదివారం మాత్రం ఆ గార్డెన్ కలకల లాడుతుంది. ముస్లిమ్స్ ఎక్కువగా వస్తుంటారు. అక్కడే వంటలు చేసుకుని సాయంత్రం వరకు గడిపి వెళుతుంటారు.

ఆ గార్డెన్‌కి అవతలి వేపు ఒక సరస్సు, దాని చుట్టూ ఆల్చిప్పలు, నత్తగుల్లలు విపరీతంగా ఉంటాయి. ఆ సరస్సులో ఉన్న నీరు కూడ— ఆలీ సాగర్ గార్డెన్ లాగే ఆకు పచ్చదనంతో నిండి ఉంటుంది. నేను రోజూ ఇక్కడే కూర్చుని ఒక్కొక్క ఆల్చిప్ప తీసుకుని నీటిలోకి విసురుతూ ఉంటాను. అదొక సరదా.

ఇటీవల ఒంటరి తనం నన్ను చాల ఇబ్బంది పెడుతోంది. ఇక్కడ ఉన్న నీటిని ఆ నీటిలోని పచ్చదనాన్ని చూస్తూ చాలవరకు గడుపు తున్నాను. ప్రతి వ్యక్తి జీవితంలో, ఎప్పుడో ఒకప్పుడు ఏదో అద్భుతం జరుగుతుంది. ఆ అద్భుతమే, ఆ వ్యక్తుల జీవితాన్ని పూర్తిగా మార్చి వేస్తుంది అని ఎవరన్నారోగాని. ఆ అద్భుతం కోసం ఎదురు చూస్తూ నేను గడుపుతున్నాను. ఇపుడిపుడే నాకు జీవితం అంటే మమకారం, ఆశ కలుగుతున్నాయి. ఒకనాడు లెక్కలేనట్లుగా గడిపిన నేను ఈ నాడు ఇలా అవటానికి కారణం......

నాకు పెళ్ళి అంటే ఇష్టంలేదు. నా స్వేచ్ఛకు అది భంగం కలిగిస్తుందంటాను. ఇరవై సం.ల వయసులో నా అంతటి మొగవాడు ప్రపంచంలో లేడన్నట్లు ప్రవర్తించాను. 30 సం. వయసులో చెప్పలేని అనుభవాలు. పెళ్ళివయసు దాటి పోతుంది అని ఇంట్లో వాళ్ళు ఎంత గోలపెట్టినా నేను వినిపించుకోలేదు. నెమ్మదిగా నెమ్మదిగా నేను ఒంటరివాడినయిపోయాను. ఇప్పుడు 55 సం. ల వయసులో వెనుకటి సంగతులు గుర్తు చేసుకుంటే నాకు తృప్తి నిచ్చే సంగతులు ఏమీ లేవు. ఇప్పుడు ఒంటరి తనం నన్ను బాధిస్తుంది. నన్ను నన్నుగా చూసే 'స్త్రీ'కావాలనిపిస్తుంది. ఇన్నాళ్ళు నేను గడిపిన స్త్రీలు నా 'కోరిక' తీర్చారు కాని నాకు కావలసిన స్త్రీ ఈమె అనిపించిన ఆడదిమాత్రం

పి. ఇందిరాదేవి

స్నేహితుడిని అడిగాడు వినోద్.
"ఒరే మనకు మాతృభాష ఉందిగాని పితృభాష లేదేం?"
"తల్లులుండగా తండ్రులకు మాట్లాడే చాన్సెక్కడిదిరా బాబు"
కె.వి.మధుమాధవ్ రావు

నాకు తటస్థపడలేదు. అసలు ఎలా తటస్థ పడుతుంది? వయసు వేడిలో కోరిక తీర్చుకోవటానికి పనికి వచ్చే ఆడదిగానే నేను చూసాను గాని నా హృదయానికి దగ్గరగా వచ్చే ఆడదాని కోసం నేను ప్రయత్నించలేదు.

కొద్ది నెలలుగా ఆమెను గమనిస్తున్నాను. ఆమె కూడ నాలాగే ప్రతి రోజు ఈ గార్డెన్‌కి వస్తుంది. పచ్చగడ్డిలో స్వేచ్ఛగా తిరుగుతున్న కుందేలుపిల్లల ను చూస్తూ కూర్చుంటుంది. ఆమె కళ్ళు ఎప్పుడూ తీవ్రమైన ఆలోచనలో ఉన్నట్లుగా ఉంటాయి. చూపులు కుందేలు పిల్లలను చూస్తున్నట్లు గా ఉన్నా— ఆ చూపులలో ఏదో వేదన దాగి ఉన్నట్లుగా ఆమెను గమనిస్తున్న నాకు అనిపిస్తూ ఉంటుంది.

ఆమెతో పరిచయం పెంచుకున్నాను. ఆమె కూడ నాలాగానే ఒంటరి. ఏ ప్రశ్నలడిగినా కళ్ళతో సమాధానం చెపుతుంది. ఆమె పెదవి విప్పి జవాబు చెప్పవలసిన పని లేకుండానే ఆ కళ్ళల్లోనే నాకు జవాబులభిస్తుంది.

ఈ రోజునాకు సమస్త సౌఖ్యాలు ఉన్నాయి. కాని నేను ఒంటరినే. అందుకే... అందుకే ఆమె నా దృష్టిలో పడింది. ఇప్పుడు ఈ వయసులో నేను పెళ్ళి చేసుకుని ఒక ఆడదాన్ని నమ్మకంగా నా జీవిత భాగస్వామిగా చూస్తానని ప్రమాణాలు మాత్రం చేయను. నాకు తోడు కావాలి. నాతో కలిసి జీవించటానికి ఒప్పుకునే ఆడది కావాలి.

ఆమెతో ఆ విషయమే చెప్పాను. నేను చెప్పినది వింటూనే ఆమె కళ్ళు ఆశ్చర్యంతో నన్ను చూసాయి. అసలే ఆమె కళ్ళు చాల అద్భుతంగా ఉంటాయి. ఆశ్చర్యంతో చూసినప్పుడు ఇంకా అందంగా ఉంటాయి.

"చూడు...."

చూస్తున్నట్లుగా ఆమె నా వంక చూసింది. ఆమె చేతిని నా చేతిలోకి తీసుకుని ఆమె అరచేయి చూసాను. ఆ అర చేతిలో ఒక్క మచ్చ కూడ లేనట్లుగా నున్నగా తెల్లగా ఉంది. ఆమె చేతిలో నా చూపుడు వేలితో గీతలు గీస్తూ అడిగాను.

"నువ్వు నా దగ్గర ఉండాలి. నీ గురించి నీవు చెప్పకుండానే తెలుసుకున్నాను. నీవు బాధ్యతలతో జీవితాన్ని త్యాగం చేసావు. నేను పొగరు మోతుతనంతో ఎవర్ని నమ్మకుండా మూర్ఖత్వంగా జీవితాన్ని వ్యర్థం చేసుకున్నాను. ఎందుకో మనం ఇలా కలుసుకున్నాము. నీ కళ్ళు.... నీ కళ్ళు మొట్ట మొదటి సారిగా చూసినప్పుడు నీ కళ్ళలో కనిపించిన పవిత్రత నీ శరీరంలో కూడ ఉందనిపించింది. నీవు ఇలా తటస్థ పడబోతావని కాబోలు నేను ఇలా ఒంటరిగా ఉన్నాను.

నీకు ఎగతాళిగా ఉండవచ్చు. ఈ వయసులో ఇలాంటి కబుర్లు ఏమిటని?" అవునా? ఆమె ముఖం పట్టుకుని— ఆమె కళ్ళల్లోకి చూస్తూ అడిగాను. ఆమె తన అంగీకారం త్వరలోనే చెపుతానంది. ఆమె కోసం ఎదురు చూస్తున్నాను. ఎందుకని రాలేదు. ఏమై ఉంటుంది? ఏ సమాధానం చెప్పకుండా ఉండాలని ఆమె రాకుండా ఉందా? పరిపరి విధాలుగా ఉన్నాయి నా ఆలోచనలు.

అసలు ఏ ఆడది ఒప్పుకుంటుంది. పెళ్ళి చేసుకోకుండా తనతో ఉండటానికి. అందులో మన భారత దేశంలో పెళ్ళి చేసుకుని మాత్రం ఎంత పవిత్రంగా ఉన్నారు? ఏమిటో ఈ చాదస్తాలు. ఈ బంధనాలు, నాకు చాల విసుగ్గా ఉంది. ఆల్చిప్పలు నీళ్ళల్లోకి విసురుతూ— కదిలే ఆ నీళ్ళను చూస్తున్న నాకు, ఆ నీళ్ళల్లో ఆమె రూపం కనపడింది. ఉలిక్కిపడి ఆమె వంక చూసాను. ఆకు పచ్చని చీరలో ఆమె..... అంటే తన అంగీకారం తెలిపినట్లేగా? ఆమె వంక కన్నార్పకుండా చూస్తుంటే ఆమె కళ్ళతో నవ్వి నాకు తన చేయి అందించింది. నేను ఆ చేయి పట్టుకుని లేచి నిలబడి ఆమె నడుంచుట్టూ చేయి వేసాను. నెమ్మదిగా ఆమెని ఆనుకుని నడుస్తూ....

క్రీపర్స్‌తో పూర్తిగా కప్పవున్న ఆ హట్‌లోపలికి తీసుకువెళ్ళి— పచ్చని తివాచి పరిచినట్లుగా ఉన్న ఆ మెత్తటి పచ్చటి గడ్డిమీద ఆమెను— ఎప్పటినుంచి— ఎన్నాళ్ళ నుంచి ఈ హట్‌లో ఇలా....

ఆమె కళ్ళు వింత కాంతితో మెరుస్తున్నాయి. ఆమె కళ్ళు నన్నే చూస్తున్నాయి. ఆ కళ్ళని ముద్దు పెట్టుకుని నెమ్మదిగా ఆమె పెదవులు అందుకోబోతున్న నా పెదవులు చూసి ఆమె కళ్ళు మూసుకుంది.

సిగ్గుపడుతుందా? లేక ఈ వయసులో ఈ కార్యక్రమం. చూడకూడదని కళ్ళు మూసుకుందా? ఆమెని బ్రతిమాలి కళ్ళు తెరవమని చెప్పాను. ఆమె చూస్తుండగా ఆ పెదవులని అందుకుంటున్న నా పెదవులు....

—అక్కడే గడ్డి పరకలు తుంపుకు తింటున్న కుందేలుపిల్ల ఉలిక్కిపడి మమ్మల్ని చూసి సిగ్గుతో తుర్రుమంటూ హట్ బయటకు పరుగు తీసింది. మా కార్యక్రమానికి అడ్డు ఉండకూడదని.

*



నూతన యవ్వనం
పొందండి!
సంతానవంతులు కండి!
చర్మవ్యాధుల నుండి
విముక్తులు కండి!!

హస్తప్రయోగము వలన కలిగిన నరముల బలహీనత, అంగముచిన్నదగుట, అవసరకాలమందు అసంతృప్తి, దాంపత్య సుఖం లేకపోవుట, సంతానము లేకపోవుట, సోరియాసిస్, తెలుపు (చల్లి), నలుపు, ఎరుపు మచ్చలు, రసిపుండ్లు, సుఖసంబంధమైన వ్యాధులు, ఫిస్టూలా, స్త్రీల కుసుమవ్యాధులకు, చర్మవ్యాధులకు ఆయుర్వేద చికిత్స చేయబడును. పోస్టు ద్వారా కూడా చికిత్సకలదు.

క్యాంపులు

ప్రతినెల: 1, 16 తేదీలలో రాజమండ్రి, హోటల్ అశోకాలో, కోటగుమ్మంవద్ద
ప్రతినెల: 2, 17 తేదీలలో కాకినాడ, వీనస్ A/c లాడ్జి కల్పనాటాకీసువద్ద
ప్రతినెల: 3, 18 తేదీలలో భీమవరం, షణ్ముఖలాడ్జిలో
ప్రతినెల: 9వ తేదీన ఒంగోలు, హోటల్ పూర్ణిమలో బస్‌స్టాండ్‌వద్ద
ప్రతినెల: 25వ తేదీన ఖమ్మం హోటల్ కిన్నెర A/cలో బస్‌స్టాండ్‌వద్ద
★ ప్రతి క్యాంపులోనూ ఉదయం గం. 10-నుండి రా॥ 10 వరకు పైక్యాంపు తేదీలు మినహా మిగిలిన రోజుల్లో డాక్టరుగారు గుడివాడ క్లినిక్‌లో వుంటారు.

ఆయుర్వేద అలంకార
డా॥ డి.మార్కండేయులు
(ఆయుర్వేదభిషక్, సెక్స్ & స్కిన స్పెషలిస్టు)
పార్కురోడ్, గుడివాడ-1
ఫోన్స్: 2522 & 2540